# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం 22 జూన్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## ఎడ్‌సెట్ ఫలితాలు విడుదల

- మొత్తం 96.38 శాతం మంది అభ్యర్థులు ఉత్తీర్ణత

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రాష్ట్రంలోని బీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఎడ్‌సెట్-2025 ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ఈ పరీక్షకు హాజరైన అభ్యర్థుల్లో 96.38 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ఈ ఫలితాలను రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి, కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ కె. ప్రతాప్‌రెడ్డి శనివారం హైదరాబాద్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విడుదల చేశారు. ఈ ఏడాది ఎడ్‌సెట్ పరీక్షకు మొత్తం 32,106 మంది విద్యార్థులు హాజరు కాగా, వారిలో 30,944 మంది అర్హత సాధించారు. దీంతో మొత్తం ఉత్తీర్ణత శాతం 96.38గా నమోదైందని అధికారులు పేర్కొన్నారు. పరీక్షలో టాపర్ల వివరాలను పరిశీలిస్తే, హైదరాబాద్‌కు చెందిన గణపతిశాస్త్రి 126 మార్కులతో ప్రథమ ర్యాంకును సొంతం చేసుకున్నారు. హైదరాబాద్‌కే చెందిన శరత్‌చంద్ర 121 మార్కులతో ద్వితీయ ర్యాంకు సాధించగా, వరంగల్‌కు చెందిన నాగరాజు తృతీయ ర్యాంకును దక్కించుకున్నట్లు అధికారులు వెల్లడించారు.

## యోగాను
# మరింతగా విశ్వవ్యాప్తం చేస్తాం

- యోగా ప్రపంచ దేశాలనూ కలిపింది
- ప్రధాని మోడీ
- విశాఖలో అంతర్జాతీయ యోగా దినోత్సవం



**బలగం టీవి, విశాఖపట్నం**

యోగాను ప్రపంచం గుర్తించిందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ అన్నారు. 'యోగాను మరింతగా విశ్వవ్యాప్తం చేస్తాం. దీనికోసం యోగాను మరింతగా ఆధునీకరిస్తాం. ఆధునిక పరిశోధనల ద్వారా యోగా సైన్స్‌ను బలోపేతం చేస్తాం. వైద్య సేవల్లోనూ వినియోగిస్తాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు పలు ప్రధాన వైద్య సంస్థలు ఈ దిశలో ఇప్పటికే కృషి చేస్తున్నాయి.' అని చెప్పారు. విశాఖ సాగర తీరంలో శనివారం ఉదయం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం ఉదయం నిర్వహించిన 'యోగాంధ్ర -2025'లో ఆయన పాల్గొని అసనాలు వేశారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఈ కార్యక్రమం చరిత్ర సృష్టించింది. తీరం పొడవునా కిలోమీటర్ల తరబడి ప్రజలు యోగసనాలు వేశారు. ఆర్‌కె బీచ్ నుంచి భోగాపురం వరకూ సుమారు 30 కిలోమీటర్ల మేర ఈ ప్రక్రియ కొనసాగిదంది, సముద్రంలో 11 యుద్ధ నౌకలపై నేవీ సిబ్బంది ఆసనాలు వేస్తూ యోగాడేలో పాల్గొన్నారు. 3.01 లక్షల మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ప్రారంభం నుండి చివరి వరకు పరిశీలించిన గిన్నిస్ బుక్ పరిశీలకులు లక్షల మంది 'యోగాంధ్ర -2025'లో పాల్గొన్నట్లు ధృవీకరించారు. ఈ మేరకు ధృవ పత్రాలను రాష్ట్ర మంత్రులు లోకేష్, సత్యకుమార్‌లకు అందచేశారు. గతంలో సూరత్‌లో 1.47 లక్షల మందితో సాధించిన యోగా రికార్డును విశాఖపట్నం కార్యక్రమం అధిగమించినట్లు గిన్నిస్ పరిశీలకులు నిర్ధారించారు. అంతకుముందు ప్రధానమంత్రి నరేంద్రమోడీ యోగా స్మారక పోస్టల్ స్టాంప్‌ను వేదికపై విడుదల చేశారు. అనంతరం ప్రజల నుద్దేశించి మాట్లాడుతూ ప్రతి దేశం, ప్రతి సమాజం యోగాను జీవన శైలిలోనూ, ప్రభుత్వ విధానాల్లోనూ భాగంగా మార్చుకోవాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. దశాబ్ధకాలం క్రితం జూన్ 21ని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించాలని ఐక్యరాజ్యసమితిని కోరిన రోజును గుర్తు చేసుకున్నారు. 'చాలా తక్కువ సమయంలో 175 దేశాలు ఆ ప్రతిపాదనకు మద్దతు తెలిపాయి.' అని ఆయన చెప్పారు. పదకొండు సంవత్సరాల తరువాత ప్రస్తుతం అంతరిక్షంలో శాస్త్రవేత్తలు సైతం యోగా చేస్తున్నారన్నారు. దివ్యాంగులు బ్రెయిలీ లిపి ద్వారా యోగా శాస్త్రాన్ని అధ్యయనం చేస్తున్నారని చెప్పారు. దీనికి వయోపరిమితి, హద్దులు లేవని అన్నారు. ఇది మానసిక ఒత్తిడిని తగ్గిస్తుందన్నారు. అశాంతి, అలజడులు పెరుగుతున్న తరుణంలో వ్యక్తిగత క్రమ శిక్షణతో జీవన శైలిలో మార్పు కోసం యోగా అలవర్చుకోవాలన్నారు. ప్రపంచాన్ని స్థూలకాయ సమస్య వేధిస్తోందని, వంటనూనె వాడకాన్ని పది శాతం తగ్గించుకోవాలని సూచించారు. వైద్యంలో సైతం యోగాను అమలు చేయాలని భావిస్తున్నట్లు చెప్పారు. దీనిలో భాగంగా యోగా వినియోగంతో 'ఎవిడెన్స్ బేస్డ్ థెరపీ'ని అమలు చేయాలని అన్ని ప్రధాన వైద్య సంస్థలను కోరినట్లు చెప్పారు. ఈ దిశలో ఎయిమ్స్ ఇప్పటికే చేసిన పరిశోధనల్లో కార్డియాక్, న్యూరలాజికల్ సమస్యల పరిష్కారంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని తేలిందని తెలిపారు. యోగా సర్టిఫికెట్లకు ఉద్యోగావకాశాల్లో పర్సంటేజీని ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. ఉదయం 6.26 నిమిషాలకు ప్రధాని మోడీ సభా వేదికపైకి విచ్చేశారు. 15 నిమిషాలకు పైగా ప్రసంగించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. ఒలింపిక్స్, ఆసియా, కామన్‌వెల్త్ క్రీడల్లోనూ మిగిలా 2వ పేజీలో

## సూర్య నమస్కారాలతో గిన్నిస్ రికార్డు




**బలగం టీవి, విశాఖపట్నం**

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని గిరిజన విద్యార్థులు గిన్నిస్ రికార్డు సృష్టించారు. విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో అల్లూరి జిల్లాలోని 106 పాఠశాలలకు చెందిన 25వేల మంది విద్యార్థులు పాల్గొని 108 నిమిషాల్లో 108 సూర్య నమస్కారాలు చేశారు. ఈ కార్యక్రమాన్ని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు ప్రతినిధులు పర్యవేక్షించారు. రికార్డు పత్రాన్ని శనివారం ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబుకు అందించనున్నారు. ఈ సందర్భంగా కేంద్ర ఆయుష్ శాఖా మంత్రి ప్రతాపరావ్ జాదవ్ మాట్లాడుతూ అడవి బిడ్డలు రికార్డు నెలకొల్పడం ఆనందంగా ఉందన్నారు. ఇందులో భాగస్వాములైన విద్యార్థులను ఆయన అభినందించారు. ప్రపంచ రికా ర్డు సృష్టించడం ద్వారా దేశ గౌరవాన్ని మరింత పెంపొందించారని కొనియాడారు. వీరిని పట్టణ ప్రాంతాల్లోని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, చరిత్రలో ఎన్న డూ లేనివిధంగా 25 వేల మంది మిగితా 2వ పేజీలో



## రియల్ ఎస్టేట్ వ్యాపారం తగ్గలేదు

- కాంగ్రెస్ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారు
- రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి డీ శ్రీధర్ బాబు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం తగ్గిందంటూ కొందరూ కావాలనే పనిగట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని, అలాంటిది ఏమీ లేదని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి డీ శ్రీధర్ బాబు కొట్టిపారేశారు. శనివారం హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ లో ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న నిర్మాణ రంగం అభివృద్ధికి మా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని, ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరిస్తున్నామని శ్రీధర్ బాబు అన్నారు. ఈ వేదిక ద్వారా బిల్డర్లు, కొనుగోలుదా రులకు ఒక్కటి స్పష్టంగా చెప్పాలనుకుంటున్నాను, ప్రభుత్వం మీ వెంట ఉందని, నిర్మాణ రంగ అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోవడానికైనా సిద్ధంగా ఉందన్నారు. ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని, ధైర్యంగా అడుగు ముందుకు వేయండని ఆయన కోరారు.

2024- 25 ఆర్థిక సంవత్సరంలో రియల్ ఎస్టేట్ అండ్ ప్రొఫెషనల్ సర్వీసెస్ రంగంలో 15.4 శాతం వృద్ధి రేటు నమోదు కాగా, నిర్మాణ రంగం 11.97 శాతం వృద్ధి చెందిందన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఈ రంగం రూ.80వేల కోట్లు సమకూర్చిందని ఇది తెలంగాణ సర్వీసెస్ ఎకానమీలో ఈ రంగం వాటా 24.9 శాతం అని ఆయన అన్నారు. ప్రస్తుతం టీజీ రెరా దగ్గర 9,744 రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు రిజిస్టర్ అయ్యాయి. ఇవి గణాంకాలు కాదు మా హయాంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం నెమ్మదించిందటూ తప్పుడు ప్రచారం చేస్తున్న వారికి కళ్లు తెరిపించే వివరాలు అని వివరించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఒక్క హైదరాబాద్ లోనే 5,900 ఇళ్ల రిజిస్ట్రేషన్ జరగ్గా, మొత్తం రిజిస్ట్రేషన్లలో రూ.కోటి, అంత కంటే ఎక్కువ ధర గల ఇళ్ల వాటా 18 శాతంగా ఉందన్నారు. ఈ తరహా ఇళ్ల కొనుగోలులో వార్షిక వృద్ధి రేటు 58 శాతంగా నమోదు అయ్యిందని నైట్ ఫ్రాంక్ సంస్థ తన నివేదికలో వెల్లడించిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో అర్హులైన వారందరికీ దశల వారీగా ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని, తొలి దశలో 4.16 లక్షలు ఇచ్చామన్నారు. సమాజాంలో ప్రతి ఒక్కరూ తలెత్తుకొని గౌరవప్రదంగా జీవించాలనే సంకల్పంతోనే ఈ పథకానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా ఈ రంగానికి అవసరమైన అత్యుత్తమ నైపుణ్య మానవ వనరులను తయారు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు అరికపూడి గాంధీ, గంద్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు.

## ముగిసిన రెవెన్యూ సదస్సులు

- మూడు విడతల్లో 10వేల సదస్సులు,
- 8.58 లక్షల దరఖాస్తుల స్వీకరణ
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్: దశాబ్ధకాలం పాటు బి.ఆర్.ఎస్ పాలనలో విధ్వంసమైన రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్వరాష్ట్రంలో ఏళ్ల తరబడి తెలంగాణ ప్రజానీకం ఎదుర్కొన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న ఆశయంతో తీసుకువచ్చిన భూభారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామని చెప్పారు. రెవెన్యూ వ్యవస్థలో భూ భారతికి ముందు భూ భారతి తర్వాత స్పష్టమైన మార్పు కనిపిస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు ముగిసిన నేపథ్యంలో మంత్రి శనివారం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాటి ప్రభుత్వం ఎంతో గొప్పగా 2020లో తీసుకువచ్చిన ఆర్వోఆర్ చట్టాన్ని తిరగరాసి పారదర్శక పాలనకు పెద్దపీట వేస్తూ రైతులు కష్టాలు తీర్చడమే ధ్యేయంగా భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామన్నారు. పదేళ్లలో రైతులు పడ్డ కష్టాలు బాధలు వారు ఏవిధమైన సమస్యలను ఎదుర్కొన్నారో చెప్పడానికి ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సులే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనమన్నారు.

మూడు దశల్లో దాదాపు 10లక్షలకు పైగా భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు వచ్చాయన్నారు. ఏప్రిల్ 14వ తేదీన భూభారతి చట్టాన్ని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి చేతుల మీదుగా ఆవిష్కరించుకోవడం జరిగిందని ఆరోజు నుంచే రెవెన్యూ వ్యవస్థలో నూతన శకం ప్రారంభమైందన్నారు. ఈ చట్టాన్ని దశల వారీగా అమలులోకి తీసుకురావడం జరిగిందని మొదటి దశలో ఏప్రిల్ 17 నుంచి 30వ తేదీ వరకు 4మండలాల్లో నిర్వహించిన 72 రెవెన్యూ సదస్సుల్లో 12వేల దరఖాస్తులు , తర్వాత రెండవ దశలో మే 5వ తేదీ నుంచి 28 మండలాల్లో నిర్వహించిన 414 సదస్సుల్లో 46 వేల దరఖాస్తులు రాగా సాదాబైనామాల అంశం మినహా సుమారు 60 శాతంపైగా సమస్యలకు పరిష్కారం చూపడం జరిగిందన్నారు.

ఈ నెల 3వ తేదీ నుంచి 20వ తేదీ వరకు 561 మండలాల్లో 10,239 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించామని ఈ సదస్సుల్లో భూ సమస్యలకు సంబంధించి 8 లక్షల దరఖాస్తులు వచ్చాయని మొత్తంగా మూడు విడతల్లో 593 మండలాల్లో 10,725 రెవెన్యూ సదస్సులు నిర్వహించామని, ఇందులో 8.58 లక్షల దరఖాస్తులు వచ్చాయని వివరించారు. అత్యధికంగా ఖమ్మం జిల్లాలో 67వేలు, భద్రాద్రి కొత్తగూడెం 61వేలు, వరంగల్ 54 వేలు, జయశంకర్ భూపాలపల్లి 48వేలు, నల్గొండ 42 వేల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

ంవెన్యూ సదస్సులకు ముందురోజే ఆయా గ్రామాల్లో రైతులకు ఉచితంగా దరఖాస్తులను ఇవ్వడం జరిగిందని ఎమ్మార్వో ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని రెవెన్యూ అధికారులే ప్రజల వద్దకు వచ్చి ఎలాంటి రుసుము లేకుండా దరఖాస్తులను స్వీకరించారని తెలిపారు. స్వీకరించిన వాటికి రశీదులను అందజేయడం జరిగిందన్నారు. వచ్చిన దరఖాస్తుల్లో ఇప్పటివరకు 3.27 లక్షల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరిగిందని, మిగిలిన వాటిని కూడా త్వరితగతిన నమోదు చేయాలని అధికారులకు సూచించారు.



## విద్యుత్తు ఉద్యోగులకు 2% డీఏ


- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

విద్యుత్తు ఉద్యోగులు, పెన్షనర్లకు కరువుభత్యం(డీఏ) మంజూరు చేసినట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. డీఏను 1.944% పెంచాలని నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. శనివారం ప్రజాభవన్‌లో సహచర మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి విద్యుత్తు ఉద్యోగులకు డీఏను ప్రకటించి ప్రసంగించారు. పెంచిన డీఏ విద్యుత్తు ఉద్యోగులతోపాటు, పెన్షనర్లు, ఆర్టిజన్లకు కూడా వర్తిస్తుందని వెల్లడించారు. ఈ నిర్ణయంతో డీఏ 14.074% నుంచి 16.018శాతానికి పెరుగుతుందని తెలిపారు. పెంచిన డీఏ ఈ ఏడాది జనవరి నుంచి అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు.

## ఫోన్ ట్యాపింగ్‌తో ఎందరో జీవితాలు నాశనం

- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్




**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఫోన్ ట్యాపింగ్‌తో ఎందరో జీవితాలు నాశనం చేసారని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. శనివారం కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొన్న అనంతరం మీడియాతో మాట్లాడారు. "మాజీ సీఎం కేసీఆర్ అనుమాన స్వభావం గలవాడు. తన పార్టీ నేతల ఫోన్లను కూడా ట్యాప్ చేయించాడు. కేసీఆర్ పాలనలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న నేతల ఫోన్లతో పాటు న్యాయమూర్తులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల ఫోన్లు సైతం ట్యాప్ అయ్యాయి" అని బండి సంజయ్ ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ ఆపరేషన్స్ హైదరాబాద్, సిరిసిల్ల కేంద్రంగా కొనసాగించబడ్డాయని, సిరిసిల్ల నుంచే కీలకంగా ప్రణాళికలు అమలు చేయబడ్డాయని చెప్పారు. "మాజీ ఎస్ఐబి చీఫ్ ప్రభాకర్ రెడ్డి అమానవీయుడు. ఆయన ఫోన్ ట్యాపింగ్ ద్వారా ఎందరో జీవితాలను నాశనం చేశాడు. నన్ను కూడా రాత్రి పన్నెండు గంటలకు అరెస్ట్ చేసిన సందర్భంలో పోలీస్ ఉన్నతాధికారులు ప్రభాకర్ రెడ్డితో మాట్లాడుతున్నట్లు నేరుగా విన్నాను" అని చెప్పారు.

"బీఆర్ఎస్ ప్రభుత్వంలో నా మీద 109 కేసులు పెట్టారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నేతలపై ఒక్క కేసు కూడా పెట్టలేదు. రాధాకృష్ణారావు ఫోన్ ట్యాపింగ్ కేసులో తానే సీఎం ఆదేశాల మేరకు చేశానని ఒప్పుకున్నా కేసీఆర్, కేటీఆర్‌లకు నోటీసులు ఎందుకు ఇవ్వడం లేదు?" అని ప్రశ్నించారు. కాంగ్రెస్ మరియు బీఆర్ఎస్‌ల మధ్య రహస్య ఒప్పందం ఉందని, అందుకే కేసీఆర్, కేటీఆర్‌లకు రాయల్ ట్రీట్‌మెంట్ ఇస్తూ నోటీసులు ఇవ్వడం లేదని తెలిపారు.

"సీబీఐ విచారణకు బీజేపీ సిద్ధంగా ఉంది. కేంద్రం నేరుగా సీబీఐ విచారణ చేపట్టలేనందున రాష్ట్ర ప్రభుత్వ నుంచి సిఫారసు రావాల్సి ఉంటుంది. సిఫారసు వచ్చిన వెంటనే ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన వారిని జైలుకు పంపిస్తాం" అని చెప్పారు. అంతేకాకుండా, ప్రభాకర్ రెడ్డి వదిలి పెట్టకూడదని, అందరూ వాట్సాప్, సిగ్నల్, ఫేస్‌టైమ్ వంటివి వాడాల్సిన పరిస్థితి రానీలా ఫోన్ ట్యాపింగ్‌తో మీడియా ప్రతినిధులు సైతం భయపడిపోయారన్నారు.




## కొత్త ఎమర్జెన్సీ నెంబర్ 112

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రాష్ట్ర ప్రజలకు బిగ్ అలెర్ట్. తెలంగాణలో అమల్లోకి 112 ఎమర్జెన్సీ నెంబర్ వచ్చింది. ఇక మీదట అన్ని అత్యవసర సేవలకు 112 అందుబాటులోకి వచ్చింది. పోలీస్, ఫైర్, రోడ్డు ప్రమాదాలు, మెడికల్, ఉమెన్, చిల్డ్రన్ అత్యవసర సేవలకు 112 నెంబర్ అందుబాటులోకి వచ్చింది. 112 డయల్ చేయగానే జీపీఎస్ ద్వారా ట్రాక్ చేసి నేరుగా సేవలు అందించనున్నారు. ప్యానిక్ బటన్ గట్టిగా నొక్కితే ఆండ్రాయిడ్ ఫోన్ నుంచి 112కి కాల్ వెళుతుంది.

## తెలంగాణ అభివృద్ధి గాథ ప్రపంచానికి ఆదర్శం

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్
- ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరమ్ వేదికగా 'గవర్నింగ్ ఇన్నోవేషన్- ఏ తెలంగాణ కేస్ స్టడీ' అంశంపై ప్రసంగం




**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత దేశంలోనే కాదు, ప్రపంచంలోనూ ఆదర్శంగా నిలిచిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. యూకేలోని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో జరిగిన ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరమ్ వేదికగా 'గవర్నింగ్ ఇన్నోవేషన్- ఏ తెలంగాణ కేస్ స్టడీ' అంశంపై ప్రసంగించిన ఆయన, రాష్ట్రం సాధించిన విజయాలను వివరించారు. తెలంగాణ రాష్ట్రం యాదృచ్ఛికంగా ఏర్పడలేదని, దశాబ్దాల ప్రజాస్వామ్య పోరాటానికి ఇది ఫలమని పేర్కొన్నారు. "తెలంగాణ స్వతంత్ర భారతదేశంలో అత్యంత విజయవంతమైన స్టార్టప్ రాష్ట్రం" అని అభివర్ణించారు. మిగితా 2వ పేజీలో

## రాష్ట్రంలో బేడీల రాజ్యం




- వచ్చే ఎన్నికల్లో గెలిచేది బీఆర్ఎస్సే
- జిన్నారం రైతుధర్నాల్లో హరీశ్‌రావు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో కేడీల రాజ్యం.. బేడీల రాజ్యం నడుస్తున్నదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. మిగితా 2వ పేజీలో

# సింగరేణి నుంచి తొలి పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో సింగరేణి కాలరీస్ కంపెనీ మరో వినూత్న విద్యుత్ ఉత్పాదన ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. రామగుండం-1 ఏరియాలోని మూతపడిన మేడిపల్లి ఓపెన్ కాస్ట్ గనిలో ఏర్పడిన నీటి సంపును ఆధారంగా 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి తొలి అడుగు వేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆదేశాలతో ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి పూర్తి స్థాయి ప్రాజెక్ట్ నివేదిక తయారీకి ప్రభుత్వ రంగ సంస్థ అయిన వైఆప్కోస్ లిమిటెడ్‌కు బాధ్యత అప్పగించారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ విషయాన్ని సీఎండీ ఎన్. బలరామ్ వెల్లడించారు. రాష్ట్రంలో ఇటువంటి ప్రాజెక్టును మొదటిసారిగా చేపట్టడం గర్వకారణమని, ఇది ప్రయోగాత్మకంగా విజయవంతమయ్యే అవకాశముందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ ప్రత్యేకత ఏమిటంటే, ఇది సాధారణ జలవిద్యుత్ ప్రాజెక్టుల తరహాలో పనిచేస్తుంది. పగటిపూట సోలార్ విద్యుత్తుతో నీటిని పైభాగంలో నిర్మించే రిజర్వాయర్‌లోకి పంపించి, రాత్రివేళ దానిని కిందికి పంపిస్తూ మధ్యలో టర్బైన్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తారు. మేడిపల్లిలో ఇప్పటికే 157 మీటర్ల లోతు కలిగిన నీటి సంపు ఉండటంతో, అదే ప్రదేశాన్ని ప్రాజెక్టు కోసం ఎంపిక చేశారు. ఉపరితలంపై 2,350 మీటర్ల పొడవుతో, 23 మీటర్ల లోతులో భారీ రిజర్వాయర్ నిర్మించనున్నారు.

ప్రాజెక్ట్ ఖర్చు దాదాపు రూ. 3,000 కోట్లుగా అంచనా వేయబడుతోంది. అయినప్పటికీ, ఇది సింగరేణికి 40 ఏళ్ల పాటు స్థిరమైన ఆదాయ వనరిగా నిలవనుందని సంస్థ భావిస్తోంది. డిపిఆర్ పూర్తైన వెంటనే నిర్మాణానికి సంబంధించిన టెండర్లు పిలవనున్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సంస్థకు చెందిన ఉన్నతాధికారులు డైరెక్టర్ ఈ అండ్ ఎం డి. సత్యనారాయణ రావు, డైరెక్టర్ ఆపరేషన్స్ ఎల్.వి. సూర్యనారాయణ, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ కే. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో పరిశుభ్రమైన, పునరుత్పాదక విద్యుత్తు విభాగంలో ఒక పెద్ద అడుగుగా ఈ ప్రాజెక్టును ప్రభుత్వం చూస్తోంది.

నిత్య జీవితంలో యోగా ప్రాధాన్యతను అందరూ గుర్తించాలని, యోగా సాధనతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపర్చుకోవచ్చని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. శనివారం గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్.. 'ప్రతి ఒక్కరు యోగా నిత్య సాధనతో ఆరోగ్యం, ఆనందం పొందాలని' అన్నారు. రాష్ట్ర ఆరోగ్య, వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనరసింహ మాట్లాడుతూ.. 'యోగా కేవలం వ్యాయామం కాదు. ఆరోగ్య సమస్యలు దూరం చేసుకునేందుకు ఇదో ఉత్తమ పరిష్కారం. యోగాభ్యాసంతో విద్యార్థులలో ఒత్తిడిని తొలగించవచ్చు. ప్రతి పాఠశాలలోనూ యోగా తరగతులు నిర్వహించాలి. యోగాను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని' తెలిపారు. క్రీడలు, పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఎమ్మెల్సీ ఏవిఎన్ రెడ్డి, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తూ, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (శాట్జ్) చైర్మన్ కే. శివసేన రెడ్డి, జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, జిహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, జిహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి కర్ణన్ సహా వైద్య విద్యార్థులు, యోగా శిక్షకులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆక్స్‌ఫర్డ్ ఫోరమ్‌లో ప్రసంగించనున్న కేటీఆర్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఈ నెల జూన్ 20-21 తేదీల్లో యునైటెడ్ కింగ్‌డమ్ లోని ప్రతిష్ఠాత్మక ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ లో నిర్వహించనున్న Oxford India Forum లో పాల్గొననున్నారు.

ఈ సందర్భంగా కేటీఆర్, "భారత అభివృద్ధికి ఫ్రంటియర్ టెక్నాలజీల పాత్ర" అనే అంశంపై ప్రసంగించనున్నారు. ఈ ప్రసంగంలో ఆయన తెలంగాణ అభివృద్ధి మోడల్, సాంకేతిక పరిజ్ఞానంను వినియోగించి సాధించిన సమగ్ర అభివృద్ధి, అంతర్జాతీయ పెట్టుబడులను రాష్ట్రానికి ఆకర్షించిన విధానం వంటి అంశాలను ప్రస్తావించనున్నారు. తెలంగాణ రాష్ట్రం విశిష్ట అభివృద్ధి విధానంతో ప్రపంచంలో అనేక దేశాల దృష్టిని ఆకర్షించగా, ఇప్పుడు ఆ మోడల్‌ను అంతర్జాతీయ వేదికపై ప్రదర్శించనున్న కేటీఆర్ ప్రసంగం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.

## జీహెచ్ఎంసీలో భారీగా బదిలీలు

**బలగం టీవీ, హైదరాబాద్**

మహానగర పాలక సంస్థలో (టౌన్ ప్లానింగ్) భారీగా బదిలీలు అయ్యాయి. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వీ. కర్ణన్ 27 మంది అధికారులను బదిలీ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. డీటీసీపీ నుంచి డిప్యూటేషన్‌పై వచ్చిన అధికారులతోపాటు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై బదిలీ వేటు వేశారు. పలువురు అధికారుల పనితీరును బట్టీ సెక్షన్ అధికారులుగా ఉన్నవారికి పదోన్నతులు లభించాయి. వివిధ మున్సిపాలిటీల నుంచి వచ్చిన ఏడుగురు అధికారులకు సర్కిల్ ఏసీపీలుగా పోస్టింగ్‌లు ఇచ్చారు.

## అసలు సినిమా 2029 తర్వాత ఉంటుంది

### కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ



**బలగం టీవీ, హైదరాబాద్**

తన రాజకీయ భవిష్యత్తుపై కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ సంచలన వ్యాఖ్యలు చేశారు. గత 11 ఏళ్ల కాలాన్ని న్యూస్ రీల్ మాత్రమేనని అభివర్ణించిన గడ్కరీ.. అసలు సినిమా 2029 తర్వాత ఉంటుందని అన్నారు. ఆ వెంటనే సర్దుకుని.. ఎవరు ఏ పాత్ర పోషించాలనేది పార్టీ నిర్ణయిస్తుందని, పార్టీ తనకు ఏ విధిని అప్పగించినా నెరవేరుస్తానని చెప్పారు. మోదీ ప్రభుత్వం 11 ఏళ్ల పాలనను పూర్తి చేసుకున్న నేపథ్యంలో గడ్కరీని ఉదయ్ నిర్గుడ్‌కర్ ఇంటర్వ్యూ చేశారు. ఈ సందర్భంగా గడ్కరీ తన రాజకీయ భవిష్యత్తుపై అడిగిన ప్రశ్నకు.. 'ఇప్పటిదాకా దేశం చూసింది న్యూస్ రీల్ మాత్రమే. అసలు సినిమా మొదలు కావడానికి ఇంకా సమయం ఉంది' అని చెప్పారు. 'పార్టీ కార్యకర్త బాధ్యతలను పార్టీ నిర్ణయిస్తుంది. ఆయన ఏం పనిచేయాలో నిర్ణయిస్తుంది. నాకు ఇచ్చే బాధ్యత ఏది అయినా దానిని నేను నెరవేరుస్తాను.' అని అన్నారు. తన రాజకీయ అనుభవాన్ని తాను ఎప్పుడు పబ్లిసిటీ చేసుకోనని, తనను ఎయిర్‌పోర్ట్‌ల వద్ద స్వాగతించేందుకు భారీ స్వాగత కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని తన మద్దతుదారులను ప్రోత్సహించనని గడ్కరీ చెప్పారు. తన వ్యక్తిగత మిషన్.. విదర్భ ప్రాంతంలో రైతుల ఆత్మహత్యలను ఆపడమేనని తెలిపారు. 'రహదారుల పనులే కాకుండా.. ఈ మధ్యకాలంలో నేను ఎక్కువగా వ్యవసాయ రంగం, సామాజిక కార్యక్రమాలపై కేంద్రీకరిస్తున్నాను' అని గడ్కరీ తెలిపారు. తలసరి ఆదాయం విషయంలో భారతదేశం ప్రపంచంలోని టాప్ టెన్ దేశాల జాబితాలో లేని విషయాన్ని ప్రస్తావించగా.. దానికి ప్రధాన అడ్డంకి భారతదేశంలో పెరుగుతున్న జనాభాయేనని చెప్పారు. జనాభా నియంత్రణ బిల్లుకు మద్దతు ప్రకటించిన గడ్కరీ.. ఇది మతపరమైన లేదా భాషాపరమైన సమస్య కాదన్నారు. ఇదొక ఆర్థిక సంబంధ అంశమని చెప్పారు. ఎంతో అభివృద్ధి జరుగుతున్నా.. దాని ఫలాలు కనిపించడం లేదని తెలిపారు. జనాభా పెరుగుదలే అందుకు కారణమని అన్నారు.

## యోగాను మరింతగా విశ్వవ్యాప్తం చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

యోగాను చేర్చేలా చొరవ చూపాలని ప్రధానిని కోరారు. మోడీ వల్లే యోగాకు అంతర్జాతీయ ఖ్యాతి లభించిందన్నారు. కుల మతాలు, ప్రాంతాలు, దేశాలు, భాషా భేదాలకతీతమైన రీతిలో ఆమోదం పొంది ఒక ఉద్యమంగా యోగా మారిందన్నారు. రోజూ ఒక గంట సమయం యోగా కోసం కేటాయించాలన్నారు. డిజిటల్ ప్రపంచంలో క్రమశిక్షణ, సృజనాత్మకతలను పెంచేందుకు వ్యాయామం ఉపయోగపడుతుందన్నారు. యోగాతోనే సంతోషకరమైన సమాజం ఏర్పడుతుందని చెప్పారు. అందుకే 'ఒన్ ఎర్త్ ఒన్ హెల్త్' నినాదం తీసుకుని 2047 నాటికి హెల్దీ, వెల్దీ ఆంధ్రప్రదేశ్‌గా విజన్ %-% స్వర్ణాంధ్ర ప్రణాళిక తయారు చేశామన్నారు..మోడీ, చంద్రబాబుల వల్లే యోగాలో ప్రపంచ రికార్డు సాధ్యమైందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. యోగా గురించి రుగ్వేదంలో పేర్కొంటే దాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చి ప్రపంచానికి తెలిసేలా చేసినవారు వీరిద్దరేనన్నారు. కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ యోగా విశిష్టతను తెలియజేశారు. యోగా డే వేదికపై గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు కె.రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు లోకేష్, ఎంపి పురంధరేశ్వరి, శ్రీభరత్ ఉన్నారు. మంత్రులు వంగలపూడి అనిత, గుమ్మడి సంధ్యారాణి, అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, సుందరపు విజరుకుమార్, గణబాబు, విష్ణుకుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ అభివృద్ధి గాథ ప్రపంచానికి ఆదర్శం

(మొదటి పేజీ తరువాయి)

కేటీఆర్ వెల్లడించిన ముఖ్య గణాంకాలు: రాష్ట్ర జీఎస్‌డీపీ రూ. 4 లక్షల కోట్ల నుండి రూ. 15 లక్షల కోట్లకు పెరుగుదల. వ్యక్తిగత ఆదాయం రూ. 1.12 లక్షల నుండి రూ. 3.57 లక్షలకు వృద్ధి. ప్యాడీ ఉత్పత్తి 68 లక్షల మెట్రిక్ టన్నుల నుండి 3 కోట్ల మెట్రిక్ టన్నుల వరకు పెరుగుదల. కాళేశ్వరం ప్రాజెక్ట్, మిషన్ భగీరథ, టీ-హబ్ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు రాష్ట్రం ఖ్యాతిని పెంచినట్లు వివరించారు.

"రైతు బంధు పథకం ద్వారా ప్రపంచంలోనే అతిపెద్ద స్థాయిలో 70 లక్షల రైతులకు 9 బిలియన్ డాలర్లు నేరుగా జమ చేశాం" అని చెప్పారు. హైదరాబాద్‌లో ఆమజాన్ వంటి అంతర్జాతీయ సంస్థల అతిపెద్ద కేంద్రాలు నెలకొన్నాయని, తెలంగాణలో పెట్టుబడులకు అనువైన వాతావరణం కల్పించామని వివరించారు. టీఎస్ ఐపాస్ ద్వారా పారిశ్రామిక అనుమతులను 15 రోజుల్లో ఇవ్వడం వల్ల రాష్ట్రం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో అగ్రస్థానం దక్కించుకుందని తెలిపారు."వైక్తిక ఆధారిత పాలన కంటే వ్యవస్థాపిత విధానాలు రాష్ట్ర విజయానికి కారణం" అని స్పష్టం చేశారు.

రాష్ట్ర అభివృద్ధిలో ఆర్థిక వృద్ధి, సామాజిక సంక్షేమం పరస్పరం సమతుల్యం కావాలని పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుతో రాజకీయాల్లో మహిళల పాత్ర మరింత బలపడుతుందన్న విశ్వాసం వ్యక్తం చేశారు."తెలంగాణ గాథను ఇతర రాష్ట్రాలు కూడా అనుసరించవచ్చు. తెలంగాణ ప్రగతి గాథకు ఇది ఆహ్వానం కాదు, ఇది ఆశలకు మార్గదర్శకం" అని ఆయన అన్నారు.

## రాష్ట్రంలో బేడీల రాజ్యం

(మొదటి పేజీ తరువాయి)

రైతులకు బేడీలు వేసి, జైళ్లలో పెట్టి వారి ఆత్మగౌరవాన్ని రేవంత్ దెబ్బతీస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతుకు బేడీలు వేస్తున్న రేవంత్‌రెడ్డికి ప్రజలు, రైతులు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. సంగారెడ్డి, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లోని రెండు లక్షల మంది రైతులకు రైతుభరోసా డబ్బులను నిలిపివేయడం దారుణమని మండిపడ్డారు. వెంటనే రైతుభరోసా డబ్బులు వేయకుంటే ఓఆర్ఆర్ దిగ్బంధించి వంటావార్పు చేస్తామని హెచ్చరించారు. లగచర్లలో గిరిజన రైతులకు, ధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటును వ్యతిరేకించిన రైతులకు రేవంత్ సర్కార్ బేడీలు వేసి జైలులో వేసింది. రైతులకు బేడీలు వేయడమే రైతు రాజ్యమా? దేశానికి అన్నంపెట్టే రైతుల చేతులకు బేడీలు వేసిన రేవంత్‌రెడ్డికి రైతులు గుణపాఠం చెప్పాలి.

రాష్ట్రంలోని అన్ని సర్వేలన్నీ బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని చెప్తున్నాయని పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గ రైతులకు రైతుభరోసా డబ్బులు నిలిపివేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జిన్నారంలో రైతు ధర్నా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన హరీశ్‌రావు అంబేద్కర్, ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ధర్నాలో పాల్గొన్న ఆయన రైతులనుద్దేశించి ప్రసంగించారు. రైతులపై రేవంత్ పగబట్టారని అన్నారు. రెండు లక్షల మంది రైతులకు రైతుభరోసా కోత పెట్టడమే కాకుండా కేసీఆర్ కిట్, న్యూట్రిషన్‌కిట్, ఫీజు రీయంబర్స్‌మెంట్, పెన్షన్లకు కోతలు పెట్టారని ఆరోపించారు. అందుకనే ఆయనను కోతల రేవంత్‌రెడ్డి అంటున్నామని చెప్పారు. ఇలా అన్నందుకు తమపై కేసులు పెడతారేమోనని అనుమానం వ్యక్తంచేశారు. కేసీఆర్ నాట్లకు నాట్లకు మధ్య రైతుబంధు వేస్తే రేవంత్‌రెడ్డి ఓట్లకు ఓట్లకు మధ్య రైతుభరోసా డబ్బులు జమచేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎంపీ ఎన్నికలకు ముందు ఒకసారి రైతుభరోసా వేశారని, ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు మరోమారు రైతుభరోసా డబ్బులు వేశారని విమర్శించారు. రెండు దఫాలుగా ఎగ్గొట్టిన రైతు భరోసా డబ్బులు కూడా వేస్తేనే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేయాలని, లేదంటే గుణపాఠం చెప్పాలని రైతులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఏ సర్వే చూసినా కేసీఆర్ తిరిగి అధికారంలోకి వస్తారని చెప్తున్నాయని తెలిపారు. బీఆర్ఎస్, కేసీఆర్ పేరు ఎత్తకుండా రేవంత్‌రెడ్డి ఎక్కడా ఉపన్యసించడం లేదని, ఆయనకు కూడా మళ్లీ గులాబీ జెండా వస్తుందని అర్థమైందని పేర్కొన్నారు. రేవంత్‌కు నిద్రలో కూడా కేసీఆరే యాదికి వస్తున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ నాట్లకు నాట్లకు మధ్య రైతుబంధు వేస్తే రేవంత్‌రెడ్డి ఓట్లకు ఓట్లకు మధ్య రైతుభరోసా డబ్బులు జమచేస్తున్నారు. అప్పట్లో ఎంపీ ఎన్నికలకు ముందు ఒకసారి రైతుభరోసా వేస్తే, ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు మరోమారు రైతుభరోసా డబ్బులు వేశారు.

లగచర్లలో గిరిజన రైతులకు, ధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటును వ్యతిరేకించిన రైతులకు రేవంత్ సర్కార్ బేడీలు వేసి జైలులో వేసిందని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులకు బేడీలు వేయడమే రైతు రాజ్యమా అని ప్రశ్నించారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో రైతురాజ్యం నడిచిందని తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా కేసీఆర్ రైతులకు రైతుబంధు ద్వారా నగదు బదిలీ చేశారని, ఉచిత కరెంటు, రైతురుణమాఫీ, రైతుబీమా లాంటి ఎన్నో పథకాలు అమలు చేశారని వివరించారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో రియల్ ఎస్టేట్‌రంగం ఆకాశాన్ని తాకిందని, ఇప్పుడు పిల్లల పెండ్లి కోసం, దవాఖాన ఖర్చుల కోసం ఆపదలో భూములు అమ్ముకుందామంటే కొనేందుకు ఎవ్వరూ ముందుకురావడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. రేవంత్ పాలనలో రైతు పతారా ఖతమైందని ధ్వజమెత్తారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో రియల్ ఎస్టేట్‌రంగం ఆకాశాన్ని తాకింది. ఇప్పుడు పిల్లల పెండ్లి కోసం, దవాఖాన ఖర్చుల కోసం, ఆపదలో భూములు అమ్ముకుందామంటే కొనేందుకు ఎవ్వరూ ముందుకురావడం లేదు" అన్నారు.

## సూర్య నమస్కారాలతో గిన్నిస్ రికార్డు

(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థులు సూర్య నమస్కరాలు చేసి చరిత్ర సృష్టించారని తెలిపారు. ప్రతి విద్యార్థి అంకితభావం, క్రమశిక్షణ, పట్టుదలతో ప్రయత్నిస్తే ఉన్నత శిఖరాలను చేరుకోవడం సాధ్యమన్నారు. కుటుంబానికి, గ్రామానికి, రాష్ట్రానికి, దేశానికి పేరు తీసుకువచ్చేలా కలలు కనాలని, వాటిని సాకారం చేసుకునేందుకు నిరంతరం యత్నించాలని సూచించారు. కార్యక్రమంలో మంత్రులు గుమ్మ డి సంధ్యారాణి, సత్యకుమార్ యాదవ్, ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అనంతరం మంత్రులు విద్యార్థులు వద్దకు వెళ్లి వారితో ముచ్చటించారు. లోకేశ్ విద్యార్థులతో సెల్ఫీలు దిగుతూ, వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

## డిసెంబర్‌లో 'కాజీపేట రైల్వేకోచ్'

**బలగం టీవీ, హైదరాబాద్**

కాజీపేట రైల్వే జంక్షన్ శివారు అయోధ్యపురంలో నిర్మిస్తున్న రైల్వే కోచ్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ వచ్చే డిసెంబర్‌లో ప్రారంభమవుతుందని దక్షిణ మధ్య రైల్వేజోన్ జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ పేర్కొన్నారు. శనివారం ఆయన కాజీపేట రైల్వేజంక్షన్ పరిసరాల్లో నిర్మించిన రన్నింగ్ రూమ్‌ను సికింద్రాబాద్ రైల్వే డీఆర్ఎం భర్తేశ్‌కుమార్‌జైన్‌తో కలిసి ప్రారంభించారు. సికింద్రాబాద్ నుంచి రైల్వే ఉన్నతాధికారులతో కలిసి ప్రత్యేక రైలులో తనిఖీలు చేసుకుంటూ కాజీపేట రైల్వే జంక్షన్‌కు చేరుకున్నారు.

## ప్రపంచానికి భారత్ ఇచ్చిన విలువైన కానుక యోగా..



**-ఎస్పీ మహేష్ బి. గితే**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలందరి సంపూర్ణమైన ఆరోగ్యం కోసం భారతదేశ ప్రాచీన వారసత్వం ఇచ్చిన విలువైన కానుక యోగా అని ,యోగాతో మానసిక,శారీరక ఆరోగ్యం, ప్రశాంత జీవనంతో ఆరోగ్యంపై పట్టు సాధించవచ్చని ఎస్పీ మహేష్ బి. గితే అన్నారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలోని పరేడ్ గ్రౌండ్ లో ఘనంగా అంతర్జాతీయ యోగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా నిత్యం బిజీ బిజీ గా ఉండే అధికారులు, సిబ్బంది నిత్యం యోగా సాధనతో తమ ఆరోగ్యంపై పట్టు సాధించాలని అన్నారు. అధికారులు, సిబ్బంది నిత్యం విధినిర్వహణలో ఉండటం వలన తమ ఆరోగ్యం పట్టించుకోకపోవడంతో ఎన్నో రకాల అనారోగ్యాలకు గురవుతున్నారని అధికారులు,సిబ్బంది ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలకు సమర్థవంతంగా సేవాలందించగలని అన్నారు.

భారతీయతత్వం ప్రతిపాదిస్తున్న సార్వత్రిక విలువల్లాగే యోగా కూడా విశ్వవ్యాప్త భావనను, ప్రాపంచిక ధృక్పథాన్ని బోధిస్తుందన్నారు.అన్ని దేశాల్లోనీ ప్రజలు యోగాలోని శక్తిని, ప్రాముఖ్యతను రోగనిరోధక సామర్థ్యాన్ని గుర్తించి యోగా ను వినియోగంలోకి తీసుకొచ్చాయనీ అన్నారు. మిగతా ఎక్సర్సైజ్ ల్లాగా కాకుండా, ఎక్కడైనా,ఎలాంటి వ్యాయామ పరికరాలు అవసరం లేకుండా ఖర్చు లేకుండా ఆరోగ్యాన్ని మానసిక సమతుల్యత లభించే ఏకైక మార్గం యోగ ఆనీ తెలిపారు.యోగా ద్వారా మెరుగైన జీవనం, అద్భుతమైన శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యం, ఉత్తమ ఆలోచనలు కలుగుతాయని అన్నారు.పోలీస్ అధికారులు,సిబ్బంది యోగాను దైనందిన జీవితంలో ఒక భాగంగా మార్చుకోవడం ద్వారా ఆనందకర జీవితాన్ని పొందగలరని అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతి రోజూ అరగంట,గంట పాటు యోగా చేస్తే చాలా వరకూ అనారోగ్యం పాలుకాకుండా ఒత్తిడి వంటివి లేకుండా ప్రశాంత జీవనం సొంతం అవుతుందన్నారు.

అనంతరం యోగ గురువు,వారి శిష్యులను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అభినందించి మెమోంటోస్ అందజేశారు.ఈ కార్యక్రమంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, సి.ఐ లు, ఆర్.ఐ లు,ఎస్.ఐ లు , అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆస్తులు,అంతస్థుల కంటే విలువైనది విద్య



**-ఎంపీడీఓ జయశీల**

**-చంద్ర ఎడ్యూకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదవ తరగతి టాపర్స్ కు సన్మానం**

**బలగం టీవీ, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం విలాసాగర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చంద్ర ఎడ్యూకేషన్ సొసైటీ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదవ తరగతిలో టాపర్ గా నిల్చిన విద్యార్థులకు,పాఠశాల ఉపాధ్యాయ బృందానికి సన్మానం చేసి, బహుమతులు ప్రధానం చేసారు. ట్రస్ట్ చైర్మన్ సి.రామరాజు మాట్లాడుతూ విద్యా దానం మహా దానం అని, గ్రామీణ పాఠశాలలో విద్యార్థులను పై చదువుల్లో రాణించడం కోసం ప్రోత్సాహించడంలో చంద్ర ఎడ్యూకేషన్ ట్రస్ట్ ఎప్పుడు అందుబాటులో ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపిడిఓ జయశీల మాట్లాడుతూ: విలాసాగర్ పాఠశాల వంద శాతం ఉత్తీర్ణత సాధించడం,మరియు మండల టాపర్ గా ఈ పాఠశాల నుండే రావడం ఈ స్కూల్ ఉపాధ్యాయుల కృషికి నిదర్శనం అని, సమాజంలో భూమి,భవనాలు,బంగారు ఆభరణాలు,విలువైన వస్తువుల కన్నా విద్య చాలా గొప్పదని, ప్రతి విద్యార్థి విద్యనే ఆయుధంగా అనేక విజయాలు సాధించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రవణ్ కుమార్, ట్రస్ట్ చైర్మన్ సి రామరాజు-లక్ష్మి దంపతులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొలుగం శ్రీనివాస్, సీనియర్ టీచర్ వెంకటహనుమాన్, మోహనకృష్ణ, లక్ష్మయ్య, శోభారాణి, మధు సురేందర్ రెడ్డి, ప్రకాష్, శ్రీనివాస్, శమంతకమని, స్వర్ణలత, క్లస్టర్ సీఆర్పీ తిరుపతి పాల్గొన్నారు.

## 27న కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ప్రత్యేక సమావేశం

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీకి సంబంధించి ఒక కీలక పరిణామం చోటు చేసుకోనుంది. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ఈ నెల 27వ తేదీన ప్రత్యేకంగా సమావేశం కానుంది. త్వరలో ప్రారంభం కానున్న ఖరీఫ్ వ్యవసాయ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది. ఈ సమావేశంలో ప్రధానంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు ఖరీఫ్ సీజన్ అవసరాల నిమిత్తం నీటి విడుదలపై చర్చించి కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుత సంవత్సరంలో ఇరు రాష్ట్రాల వాటాలు, ప్రాజెక్టులలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, తాగునీటి అవసరాలు పోను సాగునీటికి ఎంత కేటాయించాలనే అంశాలపై అధికారులు కూలంకషంగా చర్చించనున్నారు.

# యువతకు మెరుగ్గా స్వయం ఉపాధి కల్పనకు చర్యలు..

**-ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై బ్యాంకర్లు దృష్టి సారించాలి..**

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝ**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై బ్యాంకర్లు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ బ్యాంకర్లను ఆదేశించారు. శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీకృత జిల్లా కలెక్టరేట్ లో బ్యాంకర్లతో మార్చి 31, 2025 త్రైమాసిక డీసీసీ, డీ.ఎల్.ఆర్.సి.సమావేశం ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమున్న చోట నూతన బ్యాంక్ బ్రాంచ్ ప్రారంభించేందుకు గల అవకాశాలను పరిశీలించాలని బ్యాంకర్లను ఆదేశించారు.500 ఇండ్ల ఉన్న ఆవాసాలలో మొత్తం 323 బ్యాంకింగ్ అవుట్ లెట్ లను జిల్లాలో ఏర్పాటు చేశామని,జిల్లాలోని బ్యాంకులు డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించాలని అన్నారు. క్యూఆర్ కోడ్ లేని వ్యాపారస్థులను గుర్తించి వారికి ఆ సదుపాయాల కల్పనతో బ్యాంకు ఖాతా ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు.జన ధన్ బ్యాంక్ ఖాతా దారులందరు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, పి.ఎం.జె.జె.బీ.వై పథకాలలో నమోదు చేసుకునేలా చూడాలని అన్నారు. పబ్లిక్ ఔట్ రీచ్ కార్యక్రమాల్లో వీటి పై విస్తృత ప్రచారం కల్పించాలని,ప్రజలలో ఆర్థిక అక్షరాస్యత పెంచే విధంగా అవగాహన కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించాలని అన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 1519 కోట్ల రూపాయల పంట రుణ లక్ష్యానికి 1093 కోట్లు, 196 కోట్ల రూపాయల వ్యవసాయ టర్మ్ రుణాలకు గాను దాదాపు 554 కోట్ల రుణాలు అందించామని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నిర్దేశించుకున్న పంట రుణ లక్ష్యాలను నూరు శాతం చేరుకోవాలని బ్యాంకర్లను ఆదేశించారు. ఎం.ఎస్.ఎం.ఈ రంగానికి నిర్దేశించిన లక్ష్యంలో కేవలం 59 శాతం మాత్రమే రుణాలు పంపిణీ చేయడం జరిగిందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పెద్ద ఎత్తున చిన్న సూక్ష్మ పరిశ్రమల ప్రోత్సహించేలా రుణాలు మంజూరు చేయాలని అన్నారు. జిల్లాలో విద్య రుణాల పంపిణీ 16 శాతం, ఇంటి నిర్మాణ రుణాల పంపిణీ 70 శాతం మాత్రమే చేరుకోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బ్యాంకులో అందించే వివిధ విద్య రుణాలు పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలనిఅన్నారు.

జిల్లాలో జూన్ 16 నాటికి 82 స్వశక్తి సంఘాలకు 8 కోట్ల 17 లక్షలు, మెప్మా కింద 118 సంఘాలకు 14 కోట్ల 50 లక్షల బ్యాంకు రుణాలు అందించామని అధికారులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో సెర్ఫ్ రుణాల పంపిణీ వేగవంతం చేయాలని, ఎం.సి.పి లను త్వరగా బ్యాంకులకు సమర్పించాలని తెలిపారు. స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు వివిధ పథకాల క్రింద యువతకు రుణాలు అందించాలని, 2024-25 సంవత్సరంలో స్టాండ్ అప్ ఇండియా క్రింద 16 యూనిట్లకు 2 కోట్ల రుణాలు మంజూరు చేశామని, ముద్రా రుణాల కింద 8 వేల 220 మంది లబ్ధిదారులకు 101 కోట్ల 24 లక్షల రుణాలు పంపిణీ జరిగినట్లు, పీ.ఎం.ఎఫ్.ఎం.ఈ క్రింద 63 దరఖాస్తులను ఆమోదించామని అన్నారు.

కుల వృత్తులు, చేతి వృత్తుల వారికి అవసరమైన నైపుణ్య శిక్షణ అందిస్తూ ఉపాధి కల్పించే దిశగా యూనిట్ల ఏర్పాటుకు రుణాలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని ప్రారంభించిందని, దీనికోసం వచ్చే ఐదు సంవత్సరాల కాలానికి 13 వేల కోట్లు నిధులను కేటాయించడం జరిగిందని అన్నారు. పీఎం విశ్వకర్మ పథకం పట్ల విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని, జిల్లాలో ఇప్పటి వరకు 343 దరఖాస్తులకు నిబంధనల ప్రకారం పథకం మంజూరు చేసామని, పెండింగ్ ఉన్న 753 దరఖాస్తులను పక్కకు ఇచ్చేసి అర్హులకు పథకం అమలు చేయాలని సూచించారు. అనంతరం 2025-26 ఆర్థిక సంవత్సరం సంబంధించి వార్షిక రుణ ప్రణాళిక పుస్తకాన్ని ఆవిష్కరించారు.ఈ సమావేశంలో ఆర్.బి.ఐ ప్రతినిధి వి. సాయితేజ్ రెడ్డి,డిడిఎం నాబార్డు దీలిప్ చంద్రా, యూ.బి.ఐ రీజనల్ హెడ్ డి. అపర్ణ రెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజర్ టి. మల్లిఖార్జున్ రావు, డి.ఆర్.డి.ఓ. శేషాద్రి, డి.వి. హెచ్.ఓ.రవీందర్ రెడ్డి జి.ఎం.డి.ఐ.సి. హనుమంతు, ఈ.డి.ఎస్ సి కార్పొరేషన్ స్వప్న, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల బ్యాంక్ మేనేజర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు

## ఇందిరా మహిళా శక్తి భవనం గడువులోగా పూర్తి చేయాలి



**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ, సిరిసిల్ల**

ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు.శనివారం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని మెడికల్ కళాశాల సమీపంలో రూ. 5 కోట్ల నిధులతో ఎకరం స్థలంలో నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పరిశీలించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ పనులను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఇందిరా మహిళాశక్తి భవన నిర్మాణ పనులను ఈ ఏడాది నవంబర్ లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భవనం అందుబాటులోకి వస్తే మహిళా సంఘాల సభ్యులకు మీటింగులు, శిక్షణ వివిధ ప్రభుత్వ అవసరాలకు ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు.

**ప్రశ్నలు అడిగి.. సమాధానాలు రాబట్టి..**

సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా వంట గది, స్టోర్ రూమ్ ను పరిశీలించారు. ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. అనంతరం తరగతి గదుల్లో పాఠ్యాంశాలు బోధిస్తున్న తీరును పరిశీలించారు. విద్యార్థులకు మ్యాథ్స్ పాఠ్యాంశాలు బోధించి.. ప్రశ్నలు వేసి.. సమాధానాలు రాబట్టారు. ప్రతి పాఠ్యాంశాన్ని శ్రద్ధగా చదవాలని, అనుమానాలు నివృత్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యాలయం ఎస్ఓ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## భారతదేశం యోగాను ప్రపంచానికి ఆధ్యాత్మిక వారసత్వంగా అందించింది

**-బీజేపీ మండల అధ్యక్షులు పరశురామ్**

**బలగం టీవీ, బోయినిపల్లి**



భారతీయ జనతా పార్టీ బోయిన్పల్లి మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం రోజున రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలోని శ్రీ రామాలయం ఆలయ ప్రాంగణంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు పరశురాం మాట్లాడుతూ: భారతీయ సనాతన ధర్మం ప్రపంచానికి అందించిన అపురూప కానుక యోగ. యోగ ద్వారా మనస్సు శరీరాన్ని ఏకం చేస్తుందని, శారీరక ధృఢత్వాన్ని, మానసిక శాంతిని,ఆత్మశుద్ధిని చేస్తుందని,యోగ అనేక రుగ్మతలను తొలగిస్తుందని, యోగాను ప్రతిరోజు కార్యక్రమం లాగానే అలవర్చుకోవాలని తెలియజేశారు. ప్రధాని నరేంద్ర మోడీ యోగాను విశ్వవ్యాప్తం చేసి,నేడు దాదాపు 190 పైగా ప్రపంచ దేశాలు యోగాను అనుసరిస్తున్నాయి అన్నారు. చైనా అమెరికా జపాన్ వంటి దేశాలు తమ పాఠశాలల్లో యోగాను ప్రవేశపెట్టాయన్నారు.వన్ ఎర్త్ వన్ హెల్త్,ప్రపంచ శాంతిని ప్రపంచం మొత్తం ఆరోగ్యంగా ఉండాలని కోరుకునేది భారతదేశం అన్నారు. ఈ కార్యక్రమంలో యోగా శిక్షకులు శ్రీపతి కృష్ణ హరి, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదాహరి నరసింహాచారి, మాజీ మండల అధ్యక్షులు గుడి రవీందర్ రెడ్డి ,జువ్వెంతుల శ్రీనివాస్ రెడ్డి,మిర్యాల శరత్ చంద్రారెడ్డి, రాజూరి కిరణ్, మెరుపుల గంగాధర్ గౌడ్, గొట్ల అయిలయ్య, సావన్ పెల్లి అనిల్, ళ్యాణం అనిల్, చిలుమల రమేష్ శేఖర్, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# పోరాడుతున్న ఇంగ్లండ్

- ఓలీ పోప్ సెంచరీ
- రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ 209/3
- భారత్ 471 ఆలౌట్




**బలగం టీవీ, హైదరాబాద్**

భారత్‌తో లీడ్స్ వేదికగా జరుగుతున్న తొలి టెస్టులో ఇంగ్లండ్ జట్టు పోరాడుతోంది. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో టీమ్‌ఇండియాను తొలి సెషన్‌లోనే 471 పరుగులకు ఆలౌట్ చేసిన ఆ జట్టు.. తర్వాత బ్యాటింగ్‌కు వచ్చి రెండో రోజు ఆట ముగిసేసరికి 3 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. ఓలీ పోప్ (131 బంతుల్లో 100 నాటౌట్, 13 ఫోర్లు) అజేయ శతకంతో మెరవగా, బెన్ డకెట్ (94 బంతుల్లో 62, 9 ఫోర్లు) రాణించారు.

భారత జట్టు రెండో రోజు ఓవర్ నైట్ స్కోరుకు 112 పరుగులు జోడించి ఆలౌట్ అయింది. రిషభ్ పంత్ (178 బంతుల్లో 134, 12 ఫోర్లు, 6 సిక్సర్లు) రికార్డు శతకంతో కదం తొక్కగా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (147).. మొదటి రోజు ఆటకు మరో 20 పరుగులు జోడించాడు. బెన్ స్టోక్స్, జోష్ టంగ్ తలా నాలుగు వికెట్లు పడగొట్టారు. 41 పరుగుల వ్యవధిలో భారత్ చివరి 7 వికెట్లను కోల్పోయింది. కరుణ్ నాయర్ (0).. స్టోక్స్ బౌలింగ్‌లో షార్ట్ కవర్ వద్ద ఓలీ పోప్ కండ్లు చెదిరే క్యాచ్‌తో డకౌట్‌గా వెనుదిరిగాడు.

భారత ఇన్నింగ్స్ ముగిశాక వర్షం రావడంతో ఆటకు కొద్దిసేపు అంతరాయం కలిగినా ఆ తర్వాత ఇంగ్లండ్.. విధ్వంసం సృష్టించింది. అయితే బుమ్రా.. తొలి ఓవర్‌లోనే జాక్ క్రాలీ (4)ని ఔట్ చేసినా భారత్ ఆ దూకుడును కొనసాగించలేకపోయింది. క్రీజులో కుదురుకునేదాకా డకెట్ కాస్త నెమ్మదిగా ఆడినా మూడో స్థానంలో వచ్చిన పోప్ మాత్రం ఆరంభం నుంచే బ్యాటుకు పనిచెప్పడంతో ఇంగ్లండ్ రన్‌రేట్ 5కు తగ్గకుండా దూసుకెళ్లింది. టీ విరామం అనంతరం బుమ్రా వేసిన ఓవర్లో ఫోర్‌తో పోప్ హాఫ్ సెంచరీ పూర్తైంది. అయితే జస్‌ప్రీత్.. 28వ ఓవర్లో డకెట్‌ను క్లీన్‌బౌల్డ్ చేసి 122 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరదించాడు. డకెట్ నిష్క్రమణ తర్వాత జో రూట్ (28) ఆరంభంలో బుమ్రా, సిరాజ్‌ను ఎదుర్కొనేందుకు ఇబ్బందిపడ్డాడు. 80లలోకి వచ్చాక మళ్లీ దూకుడు పెంచిన పోప్.. బుమ్రా బౌలింగ్‌లో సింగిల్‌తో తన కెరీర్‌లో తొమ్మిదో శతకాన్ని నమోదుచేశాడు. కానీ మరుసటి బంతికే రూట్.. స్లిప్స్‌లో కరుణ్ చేతికి చిక్కాడు.

# డైమండ్ లీగ్‌లో నీరజ్ చోప్రాకు మరో గోల్డ్..

**బలగం టీవీ, హైదరాబాద్**




రెండు సార్లు ఒలింపిక్ పతక విజేత, భారత జావెలిన్ త్రో స్టార్ నీరజ్ చోప్రా శుక్రవారం పారిస్ డైమండ్ లీగ్ లో జర్మనీకి చెందిన జులియన్ వెబర్ ను ఓడించి రెండేళ్ల తర్వాత తన తొలి డైమండ్ లీట్ టైటిల్ ను గెలుచుకున్నాడు నీరజ్ చోప్రా. అంతకుముందు నీరజ్ చోప్రా పారిస్ డైమండ్ లీగ్ లో వరుసగా రెండు సార్లు రెండో స్థానంలో నిలిచిన సంగతి తెలిసిందే. తన మొదటి ప్రయత్నంలోనే అద్భుతమైన త్రోతో 88.16 మీటర్ల దూరం జూవెలిన్ ను విసిరి టైటిల్ ను గెలుచుకున్నాడు నీరజ్. రెండో ప్రయత్నంలోనూ 85.10 మీటర్లు విసిరాడు. దీని తర్వాత తదుపరి మూడు త్రోలు ఫౌల్స్ అయ్యాయి. చివరి ప్రయత్నంలో నీరజ్ చోప్రా 82.89 మీటర్ల దూరాన్ని ప్రయాణించాడు. పారిస్ డైమండ్ లీగ్ లో నీరజ్ చోప్రాకు ఇది మొదటి విజయం. నీరజ్ చోప్రా 2017లో జూనియర్ ప్రపంచ ఛాంపియన్ గా ఇక్కడ పాల్గొన్నాడు. ఆ సయమంలో 5వ స్థానంలో నిలిచాడు. మొదటి రౌండ్‌లో నీరజ్ చోప్రా అగ్రస్థానంలో నిలిచాడు. ఆ తర్వాత వెబర్ (87.88 మీటర్లు) ట్రినిడాడ్, టొబాగోకు చెందిన కెషోర్న్ వాల్కాట్ (80.94 మీటర్లు) ఉన్నారు. రెండవ రౌండ్‌లో వెబర్ 86.20 మీటర్లు విసిరాడు. నీరజ్ 85.10 మీటర్లు విసిరాడు. వాల్కాట్ కొద్దిగా మెరుగుపడి 81.66 మీటర్లకు చేరుకున్నాడు. అయితే, నీరజ్ మొదటి త్రో అత్యుత్తమమని నిరూపించాడు. మూడవ రౌండ్‌లో, బ్రెజిల్‌కు చెందిన డా సిల్వా 86.62 మీటర్లు విసిరి పోటీలో తన ఉనికిని చాటుకున్నాడు.

అంతకుముందు, పోలాండ్‌లో జరిగిన జానస్జ్ కుసోజిన్స్కి మెమోరియల్ మీట్‌లో పురుషుల జావెలిన్ త్రో ఈవెంట్‌లో భారతదేశానికి చెందిన డబుల్ ఒలింపిక్ పతక విజేత నీరజ్ చోప్రా 84.14 మీటర్ల ఉత్తమ ప్రయత్నంతో రజత పతకాన్ని గెలుచుకున్నాడు. ఈ ఈవెంట్ అంతటా నీరజ్ లయలో కనిపించలేదు. చాలా ఫౌల్ త్రోలు జరిగాయి. ఈ సీజన్‌లో ఇది అతనికి మూడవ పతకం. కానీ దోహా డైమండ్ లీగ్‌లో తన ప్రదర్శనను పునరావృతం చేయలేకపోయాడు. ఆ సమయంలో, జర్మనీకి చెందిన జూలియన్ వెబర్ 86.12 మీటర్లు జావెలిన్ విసిరి బంగారు పతకాన్ని గెలుచుకున్నాడు. కానీ ఈసారి, నీరజ్ త్రో ముందు, వెబర్ నాల్గవ, ఐదవ రౌండ్లలో వరుసగా 83.13 మీటర్లు, 84.50 మీటర్ల త్రోలతో తిరిగి రావడానికి ప్రయత్నించాడు. కానీ అతను 88 మీటర్ల మార్కును దాటలేకపోయాడు. చివరి రౌండ్లో, నీరజ్ 82.89 మీటర్లు స్థిరంగా త్రో చేయగా, వెబర్ 81.08 మీటర్లు, డా సిల్వా 78.56 మీటర్లు విసిరారు. పోటీ మధ్యలో నీరజ్ ప్రదర్శన అస్థిరంగా ఉన్నప్పటికీ, అతని మొదటి త్రో నిర్ణయాత్మకంగా నిరూపించింది. అతను టైటిల్‌ను గెలుచుకున్నాడు. రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత నీరజ్ చోప్రా ఇప్పుడు జూలై 5న జరగనున్న 'నీరజ్ చోప్రా క్లాసిక్' మొదటి ఎడిషన్‌లో పాల్గొంటున్నాడు. ఈ పోటీని ముందుగా మే 24న నిర్వహించాలని నిర్ణయించారు. కానీ భారత్ పాకిస్తాన్ మధ్య సరిహద్దు ఉద్రిక్తత కారణంగా జూలై 5కి వాయిదా వేశారు.

# జులై 24న హరిహర వీరమల్లు'

**బలగం టీవీ, హైదరాబాద్**




పవర్ స్టార్ పవన్ కల్యాణ్ 'హరిహర వీరమల్లు' పార్ట్ 1 విడుదల తేదీపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. ఈ సినిమాను జులై 24వ తేదీన ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ తాజాగా అధికారికంగా ప్రకటించింది. వాస్తవానికి ఈ చిత్రం ఈనెల 12న విడుదల కావాల్సి ఉండగా, కొన్ని కారణాల వల్ల వాయిదా పడింది. 'హరిహర వీరమల్లు: పార్ట్ 1- స్వోర్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో రానున్న ఈ సినిమాలో పవన్ కల్యాణ్ మునుపెన్నడూ చూడని శక్తిమంతమైన చారిత్రక యోధుడి పాత్రలో కనిపించనున్నారు. సినిమా ప్రారంభమైనప్పటి నుంచి పలుమార్లు విడుదల వాయిదా పడుతూ వచ్చింది. పవన్ రాజకీయాల్లో బిజీ కావడం, తదితర కారణాల వల్ల సినిమా చిత్రీకరణ ఆలస్యమైంది. మొదట క్రిష్ దర్శకత్వంలో కొంత భాగం చిత్రీకరణ జరుపుకున్న ఈ సినిమా బాధ్యతలను ఆ తర్వాత నిర్మాత ఏఎం రత్నం కుమారుడు జ్యోతికృష్ణ చేపట్టారు. సినిమా చిత్రీకరణ ఆలస్యం కావడం, సెట్స్ పై ఎక్కువ కాలం ఉండటంతో నిర్మాతపై ఆర్థిక భారం పడిందని భావించిన పవన్, తాను అడ్వాన్స్ గా తీసుకున్న పారితోషికాన్ని పూర్తిగా వెనక్కి ఇచ్చేసినట్లు సమాచారం. అంతేకాకుండా, తన బిజీ షెడ్యూల్ మధ్య కూడా సినిమా కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. రాత్రి 10 గంటలకు డబ్బింగ్ పనులు మొదలుపెట్టి, ఏకధాటిగా నాలుగు గంటల్లో పూర్తి చేశారని చిత్ర వర్గాలు తెలిపాయి.



# మనికా, మానవ్ ఇంటికి...

**బలగం టీవీ, హైదరాబాద్**

వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) స్టార్ కంటెండర్ టోర్నీ రెండో అంచె పోటీలలో భారత స్టార్ ప్యాడ్లర్లు మనికా బాత్రా, మానవ్ ఠక్కర్‌కు ఆరంభ రౌండ్లలోనే నిరాశ ఎదురైంది. స్లోవేనియాలో జరుగుతున్న ఈ టోర్నీలో భాగంగా శుక్రవారం రాత్రి ముగిసిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో మనికా.. 0–3 (9–11, 6–11, 4–11)తో హి ఝుజియ (చైనా) చేతిలో చిత్తుగా ఓడిపోయింది. తొలి రౌండ్‌లో 3–0తో ఫు యు (పోర్చుగల్)ను ఓడించిన మణికా.. చైనా అమ్మాయి ముందు తేలిపోయింది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో మానవ్ ఠక్కర్.. 0–3తో యు ఫి (చైనా) చేతిలో ఓడాడు. అంతకుముందు పురుషుల డబుల్స్‌లో మానవ్, మనుష్ షా జంట సైతం.. తొలి రౌండ్‌లో 1–3తో (10–12, 6–11, 11–8, 6–11)తో కొరియన్ ద్వయం కిమ్ మిన్హైక్–పార్క్ గంగ్హైన్ జోరు ముందు నిలువలేకపోయింది.

# లంక-బంగ్లా తొలి టెస్టు డ్రా

**బలగం టీవీ, హైదరాబాద్**



బంగ్లాదేశ్, శ్రీలంక జట్ల మధ్య గాలె వేదికగా జరిగిన మొదటి టెస్టు డ్రాగా ముగిసింది. శనివారం ఐదో రోజు ఆట ముగిసే సమయానికి ఆతిథ్య శ్రీలంక రెండో ఇన్నింగ్స్‌లో 4 వికెట్ల నష్టానికి 72 పరుగులు చేసింది. క్లిష్టమైన లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన లంకను బంగ్లా బౌలర్ తైజుల్ ఇస్లామ్ హడలెత్తించాడు. అతను 23 పరుగులు మాత్రమే ఇచ్చి మూడు వికెట్లు తీశాడు. తొలి ఇన్నింగ్స్‌లో కళ్లు చెదిరే శతకం సాధించిన ఓపెనర్ పాథుమ్ నిసాంకా (24) పరుగులు చేశాడు. మరో ఓపెనర్ లహిరు ఉడారా (9), దినేశ్ చండీమల్ (6), ఎంజిలో మాథ్యూస్ (8) నిరాశ పరిచారు. ఆట ముగిసే సమయానికి కమిందు మెండిస్, కెప్టెన్ ధనంజయ డిసిల్వా చెరో 12 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచారు. అంతకుముందు బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్‌లోఆరు వికెట్ల నష్టానికి 285 పరుగులు చేసి డిక్లేర్డ్ చేసింది. కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన నజ్ముల్ హుస్సేన్ శాంటో 199 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 125 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఓపెనర్ షద్మన్ ఇస్లామ్ (76), ముష్ఫికుర్ రహీం (49) తమవంతు సహకారం అందించారు. కాగా, నజ్ముల్ తొలి ఇన్నింగ్స్‌లోనూ సెంచరీ సాధించిన సంగతి తెలిసిందే.



# శివాజ్ఞ వల్లే కన్నప్ప సినిమా

**బలగం టీవీ, హైదరాబాద్**

'భగవంతుని ఆశీస్సుల వల్లే ఈ సినిమా చేయగలిగా. అందరూ హీరోలే ఈ సినిమాలో. అందరూ విజయాలను అందుకున్నవారే. వీరంతా అందించిన సహకారం వల్లే ఇది సాధ్యమైంది. మహాభారతం సీరియల్ అద్భుతంగా తీసిన ముఖేష్‌కుమార్‌సింగ్ ఈ సినిమాను అత్యద్భుతంగా తీశాడు. బోయవాడు తిన్నడు ఈశ్వరుడి కళ్లిచ్చి కన్నప్ప అయ్యాడు. అది ఎలాగో రేపు సినిమా చూస్తే తెలుస్తుంది.' అని డా.మోహన్‌బాబు అన్నారు. మంచు విష్ణు హీరోగా ఆయన నిర్మించిన భక్తిరసాత్మక చిత్రం 'కన్నప్ప'. మోహన్‌బాబు, మోహన్‌లాల్, అక్షయ్‌కుమార్, ప్రభాస్, శరత్‌కుమార్, కాజల్ అగర్వాల్ ప్రత్యేక పాత్రలు పోషించిన ఈ పానిండియా చిత్రానికి ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకుడు. ఈ నెల 27న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో మోహన్‌బాబు మాట్లాడారు. 'ఎంతో రీసెర్చ్ చేసి ఈ స్క్రిప్ట్ తయారు చేశా. శివాజ్ఞ వల్లే ఇదంతా సాధ్యమైంది. ఈ సినిమాకు పనిచేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరున ధన్యవాదాలు. ఎన్నో కష్టాలకోర్చి సినిమా చేశాను. ఇంకొన్ని రోజుల్లో విడుదలవుతోంది. ఆదరిస్తారని ఆశిస్తున్నా.' అని మంచు విష్ణు పేర్కొన్నారు

ఈ క్రమంలో ప్రభాస్ గురించి భారీ హైప్ ఇచ్చారు బ్రహ్మానందం. ప్రపంచంలోనే గొప్ప నటుల్లో ప్రభాస్ ఒకరు అని, ఆయన ఈ మూవీ చేయడం విశేషమన్నారు. ఆయన్ని కూడా ఆ శివుడే నటింప చేశాడన్నారు. మోహన్ బాబుకి ప్రభాస్ ఎంతో సన్నిహితుడు అని, ఆ స్నేహం, అనుబంధంతోనే ఆయన ఇందులో నటించినట్టు తెలిపారు హాస్య బ్రహ్మ. ప్రపంచం గర్వించదగ్గ నటుల్లో ఒకరు ప్రభాస్. ఆయన ఈ సినిమా ఎందుకు చేశారంటే, డబ్బుకోసమే, గొప్ప పాత్ర చేయాలనే ఉద్దేశ్యమో కాదు, ప్రభాస్ గొప్ప మనవతా విలువలు కలిగిన వ్యక్తి. ఎవరైనా, ఏదైనా కావాలని చేయి చాచి అడిగితే కాదనే వ్యక్తి కాదు. పైగా మోహన్ బాబుకి అత్యంత సన్నిహితుడు. విగ్గు పెట్టుకుని అలా నడిచి వస్తున్నప్పుడు, ఒళ్లు గగుర్పొడిచి వీరతాండవం, శివతాండవం చేసేటువంటి విధంగా ఈ సినిమాలో నటించాడు ప్రభాస్ అని చెబుతూ మూవీపై, ప్రభాస్ పాత్రపై హైప్ ఇచ్చాడు బ్రహ్మానందం. బ్రహ్మీ మాటలకు ఫ్యాన్స్ అరుపులతో ఆడిటోరియం ఊగిపోవడం విశేషం.